# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో పోలింగ్ అనంతరం జరిగిన ఘర్షణలపై కేంద్ర ఎన్నికల సంఘానికి వివరణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.యస్. జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఈరోజు ఢిల్లీ వెళ్లారు.**

2. **విద్యార్థుల్లో వృత్తి విద్యా కోర్సు పట్ల ఆసక్తి పెంపొందించేలా పాఠ్యాంశాలు రూపొందించాలని సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్ట్ అధికారి బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.**

3. **విజయవాడ, గుంటూరు డివిజన్లలో నిర్వహణ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.**

4. **కృష్ణా జలాల వివాదాలపై తదుపరి విచారణను జులై 15, 16 తేదీలకు వాయిదా వేస్తూ కృష్ణా ట్రైబ్యునల్ నిర్ణయం తీసుకుంది.**

5. **తిరుపతిలోని గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ రోజు ప్రారంభమయ్యాయని తిరుమల తిరుపతి దేవస్థానం తెలిపింది.**

==========================

రాష్ట్రంలో పోలింగ్ అనంతరం జరిగిన సంఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘానికి వివరణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.యస్. జవహర్‌రెడ్డి, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఈరోజు ఢిల్లీ వెళ్లారు.

--------------------------

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐటీ నైపుణ్య కోర్సులపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా 270 పాఠశాలలను ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి 3 పాఠశాలలకు ఒక నైపుణ్య నిపుణుడిని నియమించామని చెప్పారు. జూన్ నెల నుంచి విద్యార్థులకు సాంకేతిక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

--------------------------

విజయవాడ, గుంటూరు డివిజన్లలో జరుగుతున్న ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా ఆయా మార్గాల్లో నడిచే పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు విజయవాడ డివిజన్ పౌర సంబంధాల అధికారి నుస్రత్ మంద్రూప్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 వరకు రాజమండ్రి – విజయవాడ, నర్సాపూర్ – నిడదవోలు, నర్సాపూర్ – విజయవాడ, నర్సాపూర్ – రాజమండ్రి, ఈరోజు నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నం– గుంటూరు రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. రేపటి నుంచి జూన్ 1వ తేదీ వరకు విజయవాడ–హుబ్లీ రైళ్లను పూర్తిగా రద్దు చేశామని... అదేవిధంగా రామవరప్పాడు –నర్సాపూర్ రైలును భీమవరం– నర్సాపూర్ మధ్య పాక్షికంగా రద్దు చేశామని తెలిపారు.

---------------------------

కృష్ణాజలాల వివాదాలపై తదుపరి విచారణను జులై 15, 16 తేదీలకు వాయిదా వేస్తూ కృష్ణా ట్రిబ్యునల్ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో ట్రిబ్యునల్ చైర్మన్ బ్రిజేష్ కుమార్, సభ్యులు జస్టిస్ రామ్మోహన్ రెడ్డి, జస్టిస్ తాళపత్ర సమక్షంలో నిన్న జరిగిన సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. జులై 8వ తేదీలోగా సమస్యలపై నివేదికలను సమర్పించాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను కృష్ణా ట్రిబ్యునల్ ఆదేశించింది

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కొత్తూరు కేంద్రీయ విద్యాలయంలో 11వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేంద్రీయ విద్యాలయ ప్రధానోపాధ్యాయులు శంకరయ్య తెలిపారు. దరఖాస్తులను ఈనెల 23వ తేదీలోగా సమర్పించాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాల కోసం కేంద్రీయ విద్యాలయ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు. వచ్చే జూన్ 1వ తేదీన ఎంపికైన విద్యార్థులు జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.

---------------------------

ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ వ్యాధి నివారణ సాధ్యపడుతుందని శ్రీకాకుళం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి.మీనాక్షి అన్నారు. ఈరోజు శ్రీకాకుళంలోని స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో జాతీయ డెంగ్యూ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా బి.మీనాక్షి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వ్యాధులు దోమల ద్వారా సంక్రమిస్తాయని, దోమలు వ్యాప్తి చెందకుండా, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

---------------------------

తిరుపతిలోని గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈరోజు ప్రారంభమయ్యాయని తిరుమల తిరుపతి దేవస్థానం–టిటిడి తెలిపింది. బ్రహ్మోత్సవాలు భాగంగా ఈరోజు ఉదయం గోవిందరాజస్వామి ఆలయంలో మిథున లగ్నంలో గరుడ పటాన్ని ధ్వజస్తంభంపైకి ఎగురవేసి సర్వదేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు ధ్వజస్తంభానికి సుగంధ పరిమళ ద్రవ్యలతో అభిషేకాలను నిర్వహించి ధ్వజపటానికి నివేదన, మహా మంగళ హారతులు సమర్పించారు. తొమ్మిది రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజుల పాటు ఉదయం ఒక వాహనం సాయంత్రం మరో వాహనంపై స్వామివారు ఊరేగనున్నారు. ఈరోజు సాయంత్రం పెద్ద శేషవాహనంపై స్వామివారు దర్శమిస్తారు.

---------------------------

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని పాలకొల్లు మున్సిపల్ అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. వేసవి దృష్ట్యా రెండు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేశామని, స్థానిక కాలువలకు వచ్చేనెల 10వ తేదీన నీటిని విడుదల చేసే అవకాశం ఉందని, అప్పటివరకూ పాలకొల్లు పట్టణంలో నీరందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఇప్పటికే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో 12 అడుగుల వరకూ నీటిని నిల్వ చేశామన్నారు.

---------------------------

రాష్ట్రంలో ప్రభుత్వ కార్యకలాపాలు, సేవల్లో పారదర్శకత ఉండేలా ఈ–ఆఫీస్ వెబ్ అప్లికేషన్ సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు రేపటి నుంచి 25వ తేదీ వరకు నేషనల్ ఇన్ఫర్మాటిక్ సెంటర్– ఎన్ఐసీ షెడ్యూల్ ప్రకటించిందని ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న సాంకేతికత స్థానంలో కొత్త వెర్షన్ 7 ఎక్స్‌కు ఆధునీకరించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించిందన్నారు. ఈ నూతన సాంకేతికత ద్వారా సమాచారాన్ని, ఫైళ్లను భద్రపరచడంతో పాటు ఏదైనా విపత్తులు సంభవించినా సంబంధిత ఫైల్ సమాచారాన్ని తిరిగిపొందేందుకు వీలుగా కొత్త ఈ–ఆఫీస్ వెర్షన్ ఉపయోగపడుతుందని వెల్లడించారు.

---------------------------

స్ట్రాంగ్ రూముల వద్ద కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలతో మూడు అంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు బాపట్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. బాపట్లలో స్థానిక ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కలక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ యంత్రాలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు నిరంతరం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయని తెలిపారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి ఎం.వి.ఎస్. రాజు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

**......వాయిస్ 40 సెకన్లు.....**

---------------------------

ఆకాశవాణి వార్తా విభాగ డైరెక్టర్ జనరల్‌గా విధులు నిర్వర్తిస్తున్న సీనియర్ ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారి మౌష్మి చక్రవర్తికి ఆకాశవాణి డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలను ఇస్తూ ప్రసార భారతి ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది.

---------------------------

నవధాన్యాలతో భూమి సారవంతమవుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా అధికారి పి.షణ్ముఖరాజు తెలిపారు. విజయనగరం జిల్లా గరుగుబిల్లి మండలంలోని సంతోషపురం, ఖడ్గవలసల్లో ప్రకృతి వ్యవసాయం అమలు చేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాల సాగు వల్ల అధిక దిగుబడులతో పాటు నీటి తేమను నిల్వ చేసుకోవడానికి, పంటలకు అవసరమైన సూక్ష్మ, స్థూల

పోషకాలు సమృద్ధిగా అందుతాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణం పెంచేలా సిబ్బంది గ్రామగ్రామాన పర్యటించి.. రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

---------------------------

విద్యార్థుల్లో వృత్తి విద్యా కోర్సు పట్ల ఆసక్తి పెంపొందించేలా ప్రస్తుత కాలానికి అనుగుణంగా పాఠ్యాంశాలు రూపొందించాలని సమగ్ర శిక్షా రాష్ట్ర ప్రాజెక్ట్ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. నిన్న విజయవాడలో పాఠశాల విద్యా శాఖ- సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తి విద్యాకోర్సు పాఠ్యపుస్తకాల రూపకల్పన కార్యశాలలో పాల్గొని ప్రసంగిస్తూ, వృత్తి విద్యాకోర్సులు జీవన నైపుణ్యాలు పెంపొందించడమే కాకుండా విద్యార్థులకు శారీరక, మానసిక అభివృద్ధికి కూడా ఉపయోగపడతాయన్నారు.

======================